RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్: చెరుకు ఉపేందర్ | సోమవారం 14 అక్టోబర్ 2024

సంపుటి: 2 | సంచిక: 153 | పేజీలు: 4 | వెల: రూ.5/-



## గతిశక్తికి ప్రధాని మోదీ థాంక్స్

భారత్ భవిష్యత్‌పై కీలక మార్గనిర్దేశం

2లో..



## 'అలయ్ బలయ్'లో రగడ

### కేంద్ర మంత్రి Vs రాష్ట్ర మంత్రి

అలయ్ బలయ్‌లో మంత్రుల తలోమాట

కొందరు నేతల మాటలు హద్దుమీరుతున్నాయన్న కిషన్ రెడ్డి

భాష, మాటతీరులో మార్పు రావాలని హితవు

కిషన్ రెడ్డికి పొన్నం ప్రభాకర్ కౌంటర్

మత విద్వేషాలు లేకుండా మాట్లాడాలని సెటైర్లు

స్వీయ నియంత్రణ పాటించాలని చురకలు

**హైదరాబాద్, అక్టోబర్ 13 (ప్రభాత సూర్యుడు):** ప్రతి సంవత్సరం నిర్వహించినట్టుగానే ఈ ఏడాది కూడా దసరా తర్వాతి రోజున హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో అలయ్ బలయ్ కార్యక్రమం జరిగింది. రాజకీయ పార్టీల నేతలను ఒకే వేదిక మీదకు తీసుకొచ్చే ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని హర్యానా గవర్నర్ దత్తాత్రేయ దిగ్విజయంగా నిర్వహిస్తూవస్తున్నారు.

**చర్చనీయాంశంగా నేతల ప్రసంగాలు**

గతంలో దత్తాత్రేయనే స్వయంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా, కొన్నేళ్లుగా ఆయన కుమార్తె విజయలక్ష్మి జరుపుతున్నారు. ఈసారి నిర్వహించిన కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీలు హాజరవ్వగా, సీపీఐ నారాయణ బాయ్‌కాట్ చేశారు. అయితే, సఖ్యత, సమైక్యతకు స్ఫూర్తినిచ్చే ఈ వేదికపై బీజేపీ, కాంగ్రెస్ మంత్రులు చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

**విమర్శలు హద్దుమీరుతున్నాయి**

అలయ్ బలయ్ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఆయనతోపాటు, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, ఎంపీ ఈటల రాజేందర్ సహా పలువురు బీజేపీ నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతం రాజకీయ నాయకులు చేస్తున్న విమర్శలు హద్దుమీరుతున్నాయని అన్నారు. వారి ప్రసంగాల్లో, భాషలో మార్పు రావాలని ఆకాంక్షించారు. విమర్శించుకుందాం కానీ, ప్రజలు అసహ్యించుకునేలా మాట్లాడకండి అంటూ పిలుపునిచ్చారు. ఎన్నికలప్పుడు ఘర్షణ పడొచ్చు కానీ, ఎన్నికలయ్యాక ప్రజల శ్రేయస్సే ముఖ్యమని హితవు పలికారు. పార్టీలు విమర్శించుకుంటున్న విధానాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారని కిషన్ రెడ్డి, పరోక్షంగా కాంగ్రెస్ నాయకులపై సెటైర్లు వేశారు.

**పొన్నం కౌంటర్ ఎటాక్**


కిషన్ రెడ్డి చేసిన ..మిగతా 2లో

# ప్రపంచానికి ఉత్పత్తులను తయారు చేసే టాటా మిషనరీని కోల్పోయాం

- ప్రపంచంలో ఉన్న గొప్ప ధనవంతుడు పోలే, గొప్ప మనసున్న మనిషి పోయిండు
- 150 కోట్ల ప్రజల హృదయాలలో రతన్ టాటా ఎప్పుడూ రత్నం లాగా లాగా మెరుస్తూనే ఉంటాడు
- టాటా ఉత్పత్తులంటే ఒక బ్రాండ్
- భారతదేశానికి ఒక మణిరత్నం అదే రతన్ టాటా
- రతన్ టాటా మరణం దేశ ఆర్థిక రంగానికి, పరిశ్రమల రంగానికి పెద్ద నష్టం
- భారతదేశం మార్కెట్ కాదు,
- సంతోషంగా ఉండే సమాజం కావాలి
- టాటా కు వస్తున్న లాభాలు అన్ని సమాజ అస్తిత్వం కోసం
- ప్రభుత్వాలు చేయలేని పనులు టాటా సంస్థలు చేయడం ప్రజలకు గొప్ప వరం

### ప్రభాత సూర్యుడు దినపత్రిక చీఫ్ ఎడిటర్ కస్తా శంకర్రావు అతి ముఖ్య ప్రత్యేక వ్యాసం





PERSONAL

BOMBAY HOUSE,
FORT, MUMBAI-400001.

August 27, 1996.

Dear Mr. Narasimha Rao,

As I read the recent spate of unkind references to you, I felt compelled to write you to tell you that while others' memories may be short, I will always recognise and respect your outstanding achievement in heralding much-needed economic reforms in India. You and your government put India on the world map in an economic sense and made us part of a global community. Every Indian should owe you a debt of gratitude for the courageous and far-sighted "opening up" of India. I feel personally that your achievements are momentous and outstanding - and they should never be forgotten.

The purpose of this letter is just to tell you that my thoughts and best wishes are with you at this time, and that in me you have at least one person who has not, and will never, forget what you have done for India.

With warm personal regards,

Yours sincerely

Ratan

ఈ లెటర్ ను భారత ప్రధాన మంత్రిగా ఉన్న పీవీ నరసింహారావు కు రతన్ టాటా జి 1996లో రాసిన లెటర్, ఇది పీవీ నరసింహారావు గారి కుమారుడు పివి ప్రభాకర్ రావు వెలుగులోకి తెచ్చిన ఉత్తరం

**హైదరాబాద్, అక్టోబర్ 13 (ప్రభాత సూర్యుడు):** భారతదేశానికి ఆ మాటకొస్తే ప్రపంచానికే ఉత్పత్తులను తయారు చేసే "రతనాల" రతన్ టాటాను కోల్పోవడం ఒకవైపు బాధగా, రెండో వైపు సెలబ్రేషన్స్‌గా చూడాలి. ఎందుకంటే రతన్ టాటా తండ్రిగారైన జంషెడ్జీ జి టాటా, జంషెడ్పూర్‌లో ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ ప్రారంభించడంతో ఆ ప్రాంతానికి జంషెడ్పూర్ అనే పేరు రావడం ఆ ప్రాంత వాసులు గొప్ప వరంగా ఇప్పటికీ, ఎప్పటికీ భావిస్తారు. జంషెడ్ జీ టాటా నుండి రతన్ టాటా వరకు వాళ్లు ఇరాన్ నుండి భారతదేశానికి వచ్చిన "పార్సి" సంతతి వారు అన్న విషయం ఈ తరం వారు తెలుసుకోవలసిన అవసరం ఉన్నది. రతన్ టాటా మరణం దేశ వ్యాప్తంగా చర్చించుకుంటుండడం చూస్తున్న సందర్భంను బట్టి రతన్ టాటా మరణమా?? లేదు, సెలబ్రేషన్స్ ఆ!!! అన్న రీతిలో దేశ ప్రజలు దసరా పండగ సంబరంలో ఉన్నప్పటికీ రతన్ టాటా జి గురించి చర్చించుకుంటున్నారంటే మరణమా!!!?? సెలబ్రేషన్స్ ఆ!!!?? అన్నట్లు అర్థము కాని తికమకలో భారత సమాజాన్ని కట్టిపడేసిన రతన్ టాటా జి భారత్ కు "వన్నె తెచ్చిన రత్నమే". "భారతదేశం ఒక మార్కెట్ కాదు, భారత్ సంతోషంగా ఉండే సమాజం కావాలి" అని కోరుకుని, టాటా కంపెనీస్ వ్యాపార లాభాల లో వచ్చే 67% లాభాలను తిరిగి భారత ప్రజానీకానికి వివిధ రంగాలలో ఖర్చు చేసిన గొప్ప పరిశ్రమల యజమాని సంఘ సంస్కర్త మన రతన్ టాటా, "ప్రపంచ ప్రజల అవసరాలను తీర్చే వస్తువులను తయారు చేయాలనే తలంపుతో" బెంగళూరులో 1883లో వివేకానంద స్వామీజీ ప్రోత్సాహంతో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌ను, టాటా కుటుంబాల పితామహుడు ..మిగతా 2లో



## తెలంగాణ ఉద్యమానికి అలయ్ బలయ్ స్ఫూర్తి

దసరా అంటే జమ్మిచెట్టు, పాలపిట్ట గుర్తొస్తే..

అలయ్ బలయ్ అంటే దత్తాత్రేయ గుర్తొస్తారు

ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన కార్యక్రమం ఇది

పొలిటికల్ జేఏసీ ఆవిర్భావానికి మూలమైంది

జెండాలను పక్కనపెట్టి అందర్నీ ఏకం చేసింది

తెలంగాణ సంప్రదాయాలను కాపాడుకుందాం

రాష్ట్ర నేతలు, ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపు

2

### మండలిలో ప్రతిపక్షనేతగా

# మధుసూదనాచారి

### శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్, హరీశ్ రావు

**హైదరాబాద్, అక్టోబర్ 13 (ప్రభాత సూర్యుడు):** తెలంగాణ శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు సిరికొండ మధుసూదనాచారిని కలిసి మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావులు శుభాకాంక్షలు తెలియజేశారు. తొలి తెలంగాణ స్పీకర్ గా పనిచేసిన సిరికొండ మధుసూదనాచారి, ప్రస్తుతం మండలిలో ప్రతిపక్షనేతగా, బీఆర్ఎస్ పక్ష నేతగా పదవీ బాధ్యతలు చేపట్టారు. తనకి అప్పగించిన పనిని అంకితభావంతో నిర్వహిస్తానని మధుసూదనా చారి అన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన ..మిగతా 2లో



## రాజ్యాంగం ప్రకారమే నియామకాలు

హరీశ్ రావుకు మంత్రి శ్రీధర్ బాబు ప్రశ్న

ప్రతీ విషయాన్ని రాజకీయం చేయడం తగదు

బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ నేతల్ని ఎందుకు చేర్చుకున్నారు?

వ్యవస్థల్ని రాజకీయాల్లోకి లాగడం మంచిది కాదు

హరీష్ రావుకు మంత్రి శ్రీధర్ బాబు కౌంటర్



2



### మేయర్ గద్వాల విజయలక్ష్మిపై

# కేసు నమోదు

కేసు నమోదు చేసిన హైదరాబాద్ పోలీసులు

సద్దుల బతుకమ్మ వేడుకల్లో డీజే వాడకపై కేసు

**హైదరాబాద్, అక్టోబర్ 13 (ప్రభాత సూర్యుడు):** జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మిపై కేసు నమోదైంది. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో గురువారం (అక్టోబర్ 10న) రోజున జరిగిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో.. సమయం దాటిన తర్వాత కూడా పెద్ద ఎత్తున డీజే సౌండ్స్ పెట్టుకుని.. నృత్యాలు చేయటంపై పోలీసులు సుమోటోగా కేసు నమోదు ..మిగతా 2లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# మేయర్ గద్వాల విజయలక్ష్మిపై కేసు నమోదు


మొదటి పేజీ తరువాయి...

చేశారు. మేయర్ విజయలక్ష్మితో పాటు ఈవెంట్ నిర్వాహకుడు, డీజే సౌండ్స్ నిర్వాహకుడిపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. సద్దుల బతుకమ్మ వేడుకల సమయంలో.. డీజేలు పెట్టటం సర్వత్రా చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. అయితే.. ఇప్పటికే హైదరాబాద్‌లో డీజేలను నిషేధించిన విషయం తెలిసిందే. అయితే.. బతుకమ్మ వేడుకల్లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి డీజేలు పెట్టటమే కాకుండా.. తల్వార్ పట్టుకొని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. “ కొందరు ఓర్వలేక పోలీసులను ఉసిగొల్పినా.. అక్క ఉన్నంతవరకు ఎవ్వరూ కూడా భయపడనక్కర్లేదు. పోలీసులు వచ్చినా ఏం చెయ్యలేరు.. నేనున్నా... ఇవాళ ఈ తల్వార్ నేను పట్టుకున్నా.. రేపు మీరు పట్టుకోవాలి.” అంటూ గద్వాల విజయలక్ష్మి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో.. సామాన్య ప్రజలకు ఒక రూల్.. మేయర్‌కు ఒక రూలా అంటూ నగరవాసుల నుంచి నెట్టింట పెద్ద ఎత్తున ప్రశ్నలు వెల్లువెత్తాయి. దీంతో.. ఈ వ్యవహారంపై స్పందించిన హైదరాబాద్ పోలీసులు.. సుమోటోగా కేసు నమోదు చేశారు. అయితే.. హైదరాబాద్‌లో డీజేలు, ఫైర్ క్రాకర్స్ మీద నిషేదం విధిస్తూ అక్టోబర్ ఒకటో తారీఖున సీపీ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. డయల్ 100కు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా నగరంలోని.. మత పెద్దలతో సమావేశం నిర్వహించిన సీపీ సీవీ ఆనంద్.. ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నగరంలో డీజేలు, సౌండ్ మిక్సర్‌లు, హైసౌండ్ ఎక్యూప్‌మెంట్, క్రాకర్స్‌పై నిషేదం విధిస్తున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఈ నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. స్కూళ్లు, కాలేజీలు, ఆసుపత్రులు, కోర్టులకు 100 మీటర్ల వరకు నిషేదం అమల్లో ఉంటుందన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే.. బీఎన్ఎస్ చట్టం ప్రకారం ఐదేళ్ల జైలు శిక్ష, ఫైన్ కూడా విధిస్తామని సీపీ సీవీ ఆనంద్ హెచ్చరించారు. అయితే.. మేయర్ విజయలక్ష్మి మాత్రం సద్దుల బతుకమ్మ వేడుకల్లో 10 గంటలు దాటిన తర్వాత కూడా డీజే పెట్టటం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కేవలం డీజే పెట్టటమే కాకుండా.. సంచలన వ్యాఖ్యలు కూడా చేయటంపై నెట్టింట తీవ్ర విమర్శలు ఎదురయ్యాయి.

# ప్రపంచానికి ఉత్పత్తులను తయారు చేసే
# టాటా మిషనరీని కోల్పోయాం

మొదటి పేజీ తరువాయి...

జంషెడ్జి జి టాటా ప్రారంభించి, భారత్‌కు సైన్స్ బిక్ష పెట్టింది, టాటా కుటుంబమే అన్న విషయం, ఈ తరం వారు తెలుసుకోవలసిన అంశం. దేశంలో హరిత విప్లవానికి నాంది పలికింది, మన రతన్ టాటానే, భారతదేశం 1990 దశకం లో పీవీ నరసింహారావు ప్రధానమంత్రి గా ఉన్న సమయం లో గ్లోబలైజేషన్, లిబులరైజేషన్ లకు నాంది పలికింది రతన్ టాటా అనే విషయం దేశ ప్రజలు మర్చిపోవద్దు. టాటా అంటేనే తాజ్ హోటల్స్, టాటా అంటే టి సి ఎస్ (TCS), టాటా అంటేనే బంగారంలో తనిష్క్, టాటా అంటేనే ఇన్సూరెన్స్, టాటా అంటేనే సాల్ట్, టాటా అంటేనే ప్రైవేట్ బ్యాంకులు, టాటా అంటేనే అల్యూమినియం ఉత్పత్తులు, టాటా అంటేనే కన్స్ట్రక్షన్స్ రంగం, టాటా అంటేనే ఐరన్ అండ్ స్టీల్ కంపెనీస్, టాటా అంటేనే ప్రపంచంలోనే పెద్ద ఐటీ కంపెనీస్, టాటా అంటేనే మైసూర్ సిల్క్స్, భారతదేశం లోనే సొంత సాంకేతిక పరిజ్ఞానంతో కార్ల తయారు చేసి “ఇండిక” పేరుతో కార్లను ప్రపంచానికి చాటి చెప్పి, కార్ల తయారీ రంగంలో దేశానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన గొప్ప తాత్వికులు మన టాటాలు. అతి ఖరీదైన “జాగ్వార్” కార్లు తయారు చేసింది రతన్ టాటా జీనే, ఎలక్ట్రికల్ కార్ల ఉత్పత్తి చేసి కాలుష్యానికి అడ్డుకట్ట వేసింది మన రతన్ టాటానే, దేశ ప్రజల వైద్య, ఆరోగ్య విషయంలో క్యాన్సర్, ప్లేగు వంటి భయంకర వ్యాధులను నయం చేయడానికి ముంబైలో కొన్ని లక్షల మందికి ఉచిత క్యాన్సర్




చికిత్సలు చేస్తుండడం రతన్ టాటా యొక్క మానవీయ కోణం చూడవచ్చు. ప్రపంచం మొత్తంలో 100 దేశాలలో టాటా సంస్థలు విస్తరించి ఉండడం మన దేశానికే గర్వ కారణం. విమానయాన రంగంలో టాటా విమానాలను నడిపి, ఎయిర్ ఇండియాని సొంతము చేసుకొని ప్రపంచ ఖ్యాతిని గాంచిన రతన్ టాటా దూరదృష్టికి నిదర్శనం. ప్రపంచంలోనే ఆటోమొబైల్ రంగంలో రారాజుగా దేశానికి గుర్తింపు తెచ్చింది రతన్ టాటా జి నే, ముంబైలో హైడ్రో ఎలక్ట్రికల్‌ను ప్రారంభించి, విద్యుత్ శక్తిని ఉత్పత్తి చేసి, ఇప్పటికీ ముంబైకి విద్యుత్ శక్తి అందిస్తున్నారు అంటే, టాటా కంపెనీస్ గొప్పతనం తెలుసుకోవచ్చు. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రపంచ దేశాలలో వ్యాపార రంగంలో సమర్థవంతమైన ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన టాటా వ్యాపారవేత్తలు భారత్ లో ఉ ఒడడం దేశానికి గర్వకారణం. రతన్ టాటా జి యొక్క గొప్పతనాలను మరియు సేవలను గుర్తించి భారత ప్రభుత్వం పద్మభూషణ్, పద్మ విభూషణ్ బిరుదులు ఇచ్చి సగర్వంగా గౌరవించడం అంటే రతన్ టాటా జి కీర్తి ఏంటో తెలుసుకోవచ్చు. వేల, లక్షల కోట్లకు అధిపతి అయిన రతన్ టాటా జి తన కారును తనే నడిపిస్తూ, ప్రయాణం చేసేవాడంటే ఆయన సింపుల్ సిటీ జీవితాన్ని అర్థం చేసుకోవచ్చు. సామాన్యులు సైతం కార్లలో ప్రయాణం చేయాలనే గొప్ప మనసుతో లక్ష రూపాయలకే “నానో” పేరుతో కారులను తయారుచేసి, నష్టాలను సైతం లెక్కచేయక నానో కార్లను సగటు ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన మానవత్వమున్న రతన్ టాటా జి ని దేశ ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారు. రతన్ టాటా జి వివాహము చేసుకోక, అవి వివాహితుడుగా తనువు చాలించాడంటే, ఇక్కడే టాటా వాళ్ల జీన్స్ లోనే నిస్వార్థం, ప్రజా శ్రేయస్సు దేశభక్తిలతో పాటు అంకిత భావం ను అర్థం చేసుకోవచ్చు. దేశంలోని 150 కోట్ల ప్రజల హృదయాలలో మన రతన్ టాటా జి చిరస్థాయిగా సూర్యచంద్రులు ఉన్నంతకాలం ఎప్పుడూ భారత ప్రజల హృదయాలలో చిరస్థాయిగా చిరంజీవిగా నిలిచిపోతాడు.

# గతిశక్తికి ప్రధాని మోదీ థాంక్స్

## భారత్ భవిష్యత్ పై కీలక మార్గనిర్దేశం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13 (ప్రభాత సూర్యుడు):** ప్రధానమంత్రి గతిశక్తి ప్రాజెక్టు గురించి ప్రధాని నరేంద్ర మోదీ సోషల్ మీడియా ద్వారా స్పందించారు. గతిశక్తి ప్రాజెక్టు ద్వారానే వికసిత్ భారత్ లక్ష్యాన్ని మరింత వేగంగా చేరుకోగలమని ప్రధాని నరేంద్ర మోదీ వివరించారు.

### విప్లవాత్మకమైన మార్పులకే గతిశక్తి..

మౌలిక సదుపాయాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చేందుకే గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్‌కు రూపకల్పన చేశామని మోదీ అన్నారు. ఫలితంగానే భారత్ అన్ని మౌలిక రంగాల్లో మరింత వేగవంతంగా, సమర్థవంతంగా అభివృద్ధి చెందుతోందని చెప్పుకొచ్చారు. పలు ఆర్థిక ప్రణాళికలకు మల్టి-మోడల్ కనెక్టివిటీ ఇన్ఫ్రాస్ట్రక్షర్ అందించేందుకే గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్‌ను 2021, అక్టోబర్ 13న అమల్లోకి తీసుకువచ్చామన్నారు. మూడేళ్లు కింద ప్రారంభమైన దీని గురించి ప్రధాని మాట్లాడారు.

### మల్టి మోడల్ ఇన్ఫ్రాస్ట్రక్షర్ కోసమే

దేశంలోని విమానాశ్రయాలు, రైల్వే, రోడ్లు, జలమార్గాలు, ఓడరేవులు, లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి వాటి అభివృద్ధిలో గతిశక్తిదే కీలక పాత్ర అన్నారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని మరింత వేగంగా చేరుకోవాలంటే అందుకు గతిశక్తి ఒక్కటే సాధానంగా ఉ పయోగపడుతుందన్నారు. అంతేకాకుండా ఇది కొత్త ఆవిష్కరణలకు సైతం ఊతమిస్తుందన్నారు.

# ‘అలయ్ బలయ్’లో రగడ

మొదటి పేజీ తరువాయి...

వ్యాఖ్యలపై అదే వేదికపై ఇన్‌డైరెక్ట్‌గా రియాక్ట్ అయ్యారు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్. రాజకీయాల్లో భాష ముఖ్యమని, వేరేవాళ్లకు ఇబ్బంది కలగకుండా ఉండాలన్నది నిజమేనని అన్నారు. అయితే, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడకుండా స్వీయ నియంత్రణ అవసరమంటూ కౌంటర్ వేశారు. తెలంగాణలో మత విద్వేషాలు రెచ్చగొట్టకుండా మాట్లాడేలా దత్తాత్రేయ చొరవ చూపాలని కోరారు మంత్రి. వీరిద్దరు చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

# మండలిలో ప్రతిపక్షనేతగా మధుసూదనాచారి

మొదటి పేజీ తరువాయి...

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కి ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం ఆయన్ను అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, అసెంబ్లీ ఐటీ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులు కలసి శుభాకాంక్షలు తెలియజేశారు.

### కేసీఆర్‌తో ప్రత్యేక అనుబంధం

తెలంగాణ ఉద్యమ సమయం నాటి నుంచి నేటి వరకు మధుసూదనా చారి కేసీఆర్ వెన్నంటే నడిచారు.గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆ పార్టీ అగ్రనేతలతో కలిసి పనిచేశారు. నమ్మకంగా పనిచేస్తూ పార్టీకి విధేయుడిగా ఉన్న క్రమంలో ఆయనకు ప్రతిపక్ష నేతగా అవకాశం లభించింది.

### ఎన్టీఆర్ పిలుపుతో

మధుసూధనాచారి మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం అధినేత ఎన్టీఆర్ పిలుపుతో 1982లో రాజకీయాల్లోకి వచ్చారు. అనంతరం టీడీపీలో చేరి 1994-99 మధ్య కాలంలో తొలిసారిగా ఎమ్మెల్యేగా చట్టసభల్లోకి ప్రవేశించారు.

ఇక తెలంగాణ ఉద్యమం మొదలైన సమయంలో 2001లో కేసీఆర్‌కు అత్యంత దగ్గరయ్యారు. టీఆర్ఎస్ పార్టీ స్థాపనకు 8 నెలల ముందే తెలంగాణ రాష్ట్ర సాధన ఉ ద్యమంలో చురుగ్గా పనిచేశారు. సంస్థాగతంగా ఆ పార్టీని బలోపేతం చేయడంలోనూ చారి కీలక పాత్ర పోషించారు. అనంతరం ఆయన కష్టాన్ని గుర్తించిన అప్పటి టీఆర్ఎస్, పోలిట్‌బ్యూరో సభ్యుడిగా అవకాశం కల్పించింది.

1994లో తొలిసారిగా గెలిచిన చారి, అప్పటి టీడీపీ సర్కారు హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా పత్తి రైతుల బలవన్మరణాలు పెరిగిపోయాయి. చలించిపోయిన మధుసూధనాచారి పత్తి రైతుల ఆత్మహత్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు పురుగుల మందును సభలోకి తీసుకురావడం గమనార్హం. రెండోసారి 1999 ఎన్నికల్లో పోటీ చేసిన చారి, ఓటమిపాలయ్యారు.

### ముందస్తు ఎన్నికల్లో ఓటమి


%2014 అసెంబ్లీ ఎన్నికల్లో భూపాలపల్లి ఎమ్మెల్యేగా గెలిచారు. దీంతో 2014 నుంచి 2018 వరకు తెలంగాణ శాసనసభ తొలి స్పీకర్‌గా పనిచేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన చారి మరోసారి ఓటమి బాట పట్టారు.

### గవర్నర్ కోటా ఎమ్మెల్సీ

దీంతో అప్పటి సీఎం కేసీఆర్, ఆయన్ను 2021 నవంబరు 19న గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా ఎంపిక చేశారు. ఈ మేరకు గవర్నరుకు ప్రభుత్వం ప్రతిపాదనలు పంపించడంతో ఆయన నియామకానికి రాజ్ భవన్ కార్యాలయం గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. 2021 డిసెంబరు 14న గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా తెలంగాణ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఇప్పుడు తాజాగా బీఆర్ఎస్ పక్షాన ఆయన ప్రతిపక్ష నాయకుడి పాత్ర పోషించనున్నారు.

# కొండారెడ్డిపల్లిలో ‘కొండంత’ ఆప్యాయత. మురిసిన సీఎం





## దసరా వేళ స్వగ్రామంలో సీఎం
## డప్పు దరువులు, కోలాటాలు, పూలవానతో అపూర్వ స్వాగతం
## పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన
## ప్రజల ఆదరణకు సీఎం ధన్యవాదాలు

**హైదరాబాద్, అక్టోబర్ 13 (ప్రభాత సూర్యుడు):** తెలంగాణ ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి స్వగ్రామానికి వెళ్లారు రేవంత్ రెడ్డి. దసరా పర్వదినాన అక్కడకు వెళ్లి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ టూర్‌కు సంబంధించి ప్రజలు చూపిన ఆప్యాయతను గుర్తు చేసుకుంటూ ఆదివారం ఎక్స్‌లో ఓ పోస్ట్ పెట్టారు.

“కొండంత ఆప్యాయతను గుండెల నిండా నింపుకుని నా కొండారెడ్డి పల్లి పూలజల్లై మురిసింది” అంటూ తనపై జనం పూలు జల్లిన ఫోటోను పంచుకున్నారు. టూర్‌లో భాగంగా ర్యాలీ నిర్వహించగా జనం నీరాజనాలు పట్టారు. అందరికీ అభివాదం చేసుకుంటూ ముందుకు కదిలారు సీఎం.

ఆయన రాకతో అక్కడ సందడి వాతావరణం కనిపించింది. శివాలయంలో ప్రత్యేక పూజలు చేసిన రేవంత్, గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.72 లక్షలతో నిర్మించిన మోడల్ గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అక్కడ మామిడి మొక్కను నాటారు. రూ.18 లక్షలతో కట్టిన గ్రంథాలయం ఓపెన్ చేశారు.

ఎస్సీ కమ్యూనిటీ భవనం, మురుగు నీటి పైప్ లైన్ నిర్మాణం, శుద్ధి కేంద్రం, సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. అంతేకాదు, చిల్డ్రన్స్ పార్క్, జిమ్‌తో పలు పనులను ప్రారంభించారు. కోట మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు, బంధు మిత్రులు శ్రేయోభిలాషులతో కలిసి జమ్మిపూజలో పాల్గొన్నారు. తర్వాత అక్కడి నుంచి కొండంగల్ వెళ్లారు. అక్కడ తన నివాసంలో స్థానిక నాయకులను, నియోజకవర్గ ప్రజలను కలిసి, ఆత్మీయంగా పలకరించారు. ఆదివారం అక్కడి నుంచి హైదరాబాద్ చేరుకున్నారు. ఈ టూర్‌కు సంబంధించి ఓ ప్రత్యేక వీడియోను కూడా సోషల్ మీడియాలో పంచుకున్నారు సీఎం.

# మంగళగిరి టీడీపీ ప్రధాన కార్యాలయంపై దాడి కేసు సీఐడీకి అప్పగింత

## ఉత్తర్వులు జారీ




**అమరావతి, అక్టోబర్ 13 (ప్రభాత సూర్యుడు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మంగళగిరిలోని టీడీపీ పార్టీ కేంద్ర కార్యాలయం, చంద్రబాబు నివాసంపై వైసీపీ హయాంలో దాడి జరిగింది. ఈ మేరకు నమోదైన కేసులను విచారణ నిమిత్తం తాజాగా ఏపీ ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. ఈ క్రమంలోనే ఉత్తర్వులు సైతం జారీ అయ్యాయి. ప్రస్తుతం మంగళగిరి, తాడేపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఈ కేసులపై విచారణ కొనసాగుతోంది. దీంతో వీటిని సీఐడీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఫలితంగా విచారణ ఫైళ్లను సోమవారం సీఐడీకి మంగళగిరి డీఎస్పీ అందించనున్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో 2021 అక్టోబర్ 19న వైసీపీకి చెందిన కొందరు కార్యకర్తలు టీడీపీ ప్రధాన కార్యాలయంపై దాడికి పాల్పడ్డట్లు సమాచారం. వైసీపీ నేతలు దేవినేని అవినాష్, లేళ్ల అప్పిరెడ్డి, ఆళ్ల రామకృష్ణారెడ్డి అనుచరులు పార్టీ ఆఫీస్ పై దాడి చేశారు. మరోవైపు చంద్రబాబు నివాసంపైనా మాజీ మంత్రి జోగి రమేశ్, మాజీ ఎంపీ నందిగం సురేశ్ తదితరులు తమ అనుచరులతో దాడికి పూనుకున్నట్లు తెలుస్తోంది. నందిగం సురేశ్ తోపాటు పలువురు నిందితులను పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేశారు. విచారణ వేగవంతం కోసం కేసులను సీఐడీకి అప్పగిస్తూ కూటమి సర్కార్ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

# రాజ్యాంగం ప్రకారమే నియామకాలు

మొదటి పేజీ తరువాయి...

మండలిలో ప్రతిపక్ష నేతగా ఎంపికైన మధుసూదనాచారిని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి శ్రీధర్ బాబు కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. అనంతరం మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు మంత్రి. ఈ సందర్భంగా హరీష్ రావు వ్యాఖ్యలపై స్పందించారు. ప్రతిదాన్ని రాజకీయం చేయటం హరీష్ రావుకు అలవాటుగా మారిందన్నారు. ఆయన వ్యవస్థలను కూడా రాజకీయాల్లోకి లాగుతున్నారని ఫైరయ్యారు.

### అప్పుడు రాజ్యాంగం గుర్తుకు రాలేదా ?

రాజ్యాంగానికి లోబడే పట్నం మహేందర్ రెడ్డిని మండలి చీఫ్ విప్‌గా నియమించినట్టు స్పష్టం చేశారు. హరీష్ రావు శాసనసభ వ్యవహారాల మంత్రిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో ఎలా చేర్చుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో హరీష్ రావుకు రాజ్యాంగం గుర్తుకు రాలేదా అని నిలదీశారు. పీఏసీ ఛైర్మన్ పదవిని సంప్రదాయం ప్రకారం ప్రతిపక్షానికే ఇచ్చామని, ఎమ్మెల్యేల అనర్హత వేటు అంశం కోర్టు పరిధిలో ఉందని గుర్తు చేశారు శ్రీధర్ బాబు.

### అంతా బురదజల్లె కార్యక్రమం

ఏ నియామకం జరిగినా రాజ్యాంగ బద్ధంగానే ఉంటుందన్నారు. రాజకీయంగా ఏదైనా బురదజల్లే కార్యక్రమం చేయాలంటే వ్యవస్థలను ఉపయోగించడం కరెక్ట్ కాదని మండిపడ్డారు. తమ ప్రభుత్వంలో ఎక్కడా రాజ్యాంగ ఉల్లంఘన జరగడం లేదని స్పష్టం చేశారు. పీఏసీ ఛైర్మన్, చీఫ్ విప్ నియామకాలు రాజ్యాంగం ప్రకారమే జరిగాయని చెప్పారు మంత్రి.



RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com




## కర్ణాటకలో 'ముడా' ప్రకంపనలు

### ఖర్గే కీలక నిర్ణయం!

**బెంగళూరు:, అక్టోబర్ 13 (ప్రభాత సూర్యుడు):** గత కొంత కాలంగా మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) కర్ణాటకలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ వ్యవహారంలో సీఎం సిద్ధరామయ్యపై తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మనీలాండరింగ్ కేసు కూడా నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కుటుంబం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయన కుటుంబానికి సంబంధించిన సిద్ధార్థ విహార్ ట్రస్ట్‌కు గతంలో కర్ణాటక ఇండస్ట్రియల్ ఏరియాస్ డెవలప్‌మెంట్ బోర్డ్ (కేఐఏడీబీ) కేటాయించిన ఐదు ఎకరాల భూమిని స్వచ్ఛందంగా తిరిగి ఇచ్చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఖర్గే కుమారుడు రాహుల్ ఖర్గే నేతృత్వంలోని సిద్ధార్థ విహార్ ట్రస్ట్‌కు గతంలో కర్ణాటక ప్రభుత్వం.. బగలూరులోని హైటెక్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ పార్క్ హార్డ్‌వేర్ సెక్టార్‌లో ఐదు ఎకరాల భూమిని మంజూరు చేసింది. అయితే ఈ వ్యవహారాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా ఖండించాయి.

# వచ్చే నెలలో ట్రిపుల్‌ఆర్ టెండర్!

**ఉత్తర భాగానికి నోటిఫికేషన్ జారీ చేయనున్న ఎన్‌హెచ్‌ఏఐ**
**అందుకు వీలుగా టెండర్ డాక్యుమెంటేషన్ ప్రక్రియ కొలిక్కి**
**పర్యావరణ అనుమతులు వచ్చాక నిర్మాణ సంస్థ ఖరారు**
**ఈలోపు రోడ్డు నంబర్ కేటాయింపు..**
**అటవీ అనుమతుల జారీ**




**హైదరాబాద్, అక్టోబర్ 13 (ప్రభాత సూర్యుడు):** హైదరాబాద్: ట్రిపుల్‌ఆర్ (రీజినల్ రింగురోడ్డు) నిర్మాణానికి కేంద్రం వేగంగా ఏర్పాట్లు చేస్తోంది. దీనికి వీలుగా ఎన్‌హెచ్‌ఏఐ ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగం టెండర్ డాక్యుమెంటేషన్‌పై దృష్టి సారించింది. వచ్చే నెల మొదటి వారంలో టెండర్లు పిలిచే అవకాశాలున్నాయి.

**పర్యావరణ అనుమతులు రాకుండానే..**

ట్రిపుల్‌ఆర్ విషయంలో ఇప్పటికే తీవ్ర జాప్యం జరిగింది. దీంతో భవిష్యత్‌లో మరింత ఆలస్యం జరగకుండా చూడాలని ఎన్‌హెచ్‌ఏఐ భావిస్తోంది. పర్యావరణ అనుమతులు రాకుండా టెండర్ల ప్రక్రియ పూర్తి చేయటానికి వీలులేదు. కానీ, టెండర్లు పిలిచేందుకు అది అడ్డంకి కాదు. దీంతో పర్యావరణ అనుమతులు వచ్చేలోగా టెండర్లు పిలిచి, పర్యావరణ అనుమతులు వచ్చిన తర్వాత టెండర్లు ఖరారు చేయాలని అధికారులు భావిస్తున్నారు. టెండర్లు తెరిచే నాటికి అనుమతులు వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

**ఎక్స్‌ప్రెస్‌వేగా కొత్త నంబర్**

జాతీయ రహదారి హోదాలో కేంద్రం ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టు చేపడుతోంది. ఉత్తర భాగం విషయంలో ఆ స్పష్టత ఉంది. దక్షిణభాగాన్ని కేంద్రం కాకుండా సొంతంగానే చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఉత్తర భాగాన్ని సొంత నిధులతో కేంద్రమే నిర్మిస్తోంది. గతంలో కేవలం జాతీయ రహదారిగా మాత్రమే దాన్ని పరిగణించింది. కానీ, ఇటీవల దాన్ని ఎక్స్‌ప్రెస్‌వే జాబితాలో చేర్చింది. అప్పటి వరకు తాత్కాలికంగా దానికి 161ఏ నంబర్‌ను పరిగణనలోకి తీసుకున్నారు. ఇప్పుడు అది కాకుండా ఎక్స్‌ప్రెస్‌వేగా కొత్త నంబర్ కేటాయించనున్నారు. ఈ నంబర్ అలాట్ అయిన తర్వాతే ఫారెస్టు క్లియరెన్సు వస్తుంది. ఇప్పటికే ఈ రోడ్డుకు సంబంధించి పబ్లిక్ హియరింగ్స్ ప్రక్రియ పూర్తి చేశారు. పర్యావరణ అనుమతులకు అది కీలకం.

రోడ్డు నంబర్ అలాట్ అయిన తర్వాతనే పర్యావరణ అనుమతులకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. త్వరలో ఆ రోడ్డు నంబర్ కేటాయించే అవకాశముంది. పర్యావరణ అనుమతులు వచ్చిన తర్వాతే టెండర్లు తెరవాల్సి ఉంటుంది. ఈ తతంగం పూర్తయ్యే వరకు టెండర్ల కోసం ఎదురు చూడకుండా, ముందు నోటిఫికేషన్ జారీ చేయాలని అధికారులు నిర్ణయించారు. మరోవైపు భూపరిహారం పంపిణీకి వీలుగా గ్రామాల వారీ అవార్డులు పాస్ చేసే ప్రక్రియ కూడా నిర్వహించాల్సి ఉంది.

ఇది జరగాలంటే పరిహారం నిధులు ఎన్‌హెచ్‌ఏఐకి కేటాయించాలి. ఉత్తర భాగం భూసేకరణ వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం సగం మొత్తాన్ని భరించాల్సి ఉన్నందున, ఆ నిధులు రాష్ట్ర ప్రభుత్వం డిపాజిట్ చేయాలి. ఈ ప్రక్రియ కూడా వేగంగా పూర్తి చేసేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని ఎన్‌హెచ్‌ఏఐ నిర్ణయించింది. సమాంతరంగా ఈ ఏర్పాట్లు చేస్తూనే టెండర్ల ప్రక్రియ ప్రారంభించబోతున్నారు. వచ్చేనెల మొదటి వారంలో టెండర్లు పిలిచి నిర్ధారిత గడువులోపు నిర్మాణ సంస్థను ఖరారు చేయనున్నారు. ఆ తర్వాత వీలైనంత తొందరలో పనులు ప్రారంభించాలని కేంద్రం భావిస్తోంది.



### కరుణానిధి, జయలలిత లెక్కనే

# రేవంత్ కూడా విప్లవ నాయకుడు

**ప్రతిపక్షాల వద్ద పాఠాలు నేర్చుకునే స్థితిలో లేము**
**బీఆర్ఎస్ హయాంలో విద్యావ్యవస్థ నిర్వీర్యం**
**మూసీ సుందరీకరణతో తాత్కాలిక సమస్యలే**
**ప్రక్షాళన జరిగాక లక్షలాది మందికి మేలు**
**రేవంత్ నిశ్శబ్ద విప్లవ నాయకుడన్న మల్లు రవి**

**హైదరాబాద్, అక్టోబర్ 13 (ప్రభాత సూర్యుడు):** సీఎం రేవంత్ రెడ్డి నిశ్శబ్ద విప్లవ నాయకుడని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి ప్రశంసలతో ముంచెత్తారు. ఆదివారం గాంధీభవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తమిళనాడులో కరుణానిధిని, జయలలితను విప్లవ నాయకులు అంటారని అలాగే సీఎం రేవంత్ రెడ్డిని కూడా అలా పిలవాలని సూచించారు.

**లక్షల మందికి మంచే జరుగుతుంది**

ప్రత్యామ్నాయం లేకుండా మూసీ సుందరీకరణ సాధ్యం కాదని తమకు తెలుసని చెప్పారు. ఈ విషయంలో ప్రతిపక్షాల దగ్గర పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదని, గత పాలకులు రూ.7 లక్షల కోట్లు అప్పు చేసి తెలంగాణకు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. మూసీ వల్ల ప్రజలకు తాత్కాలికంగా ఇబ్బందులుంటాయని, ప్రక్షాళనతో హైదరాబాద్‌లో లక్షల మందికి లాభం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**సీఎంగా రాత్రి పగలు కష్టపడుతున్నారుఔ**

సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణను అభివృద్ధి చేయడం కోసం పగలు, రాత్రి కష్టపడుతున్నారని చెప్పారు మల్లు రవి. హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలబెట్టాలని కంకణం కట్టుకున్నారని, యువకుల కోసం, స్కిల్, స్పోర్ట్స్ యూనివర్సిటీలను తీసుకొచ్చారని తెలిపారు. సీఎం రాజ్యాంగ విలువల్ని కాపాడుతుంటే, రాజ్యాంగ హక్కులను కాలరాయాలని బీజేపీ, బీఆర్ఎస్ చూస్తున్నాయని మండిపడ్డారు. "బీఆర్ఎస్ హయాంలో విద్యావ్యవస్థ నిర్వీర్యం అయింది. 10 ఏళ్లలో 5 వేల పాఠశాలలు మూతపడ్డాయి. రాష్ట్రంలో 28 అంతర్జాతీయంగా ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా విద్యా భోజన, వసతులతో నిర్మిస్తోంది.

**ఒక్కోదానికి రూ.150 కోట్లు మరి**

ఒక్క స్కూల్ నిర్మాణానికి రూ.150 కోట్లు ఖర్చు చేస్తోంది. 2500 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థులందరికి ఒకే చోట విద్యను అందించబోతోంది" అని వివరించారు. వేల కోట్లతో కట్టిన సచివాలయం, ప్రజాభవన్ ఎవరికి ఉపయోగపడుతున్నాయని ప్రశ్నించారు మల్లు రవి. గత పాలకులకు సౌకర్యాల కోసం ప్రజా ధనాన్ని వృథా చేశారన్నారు.

### బీహెచ్ఈఎల్ శ్రీ స్నేహ లేక్ వ్యూ రెసిడెన్స్‌లో

# ఘనంగా అమ్మవారి శోభా యాత్ర



శ్రీ స్నేహ లేక్ వ్యూ రెసిడెన్స్‌లో ఏర్పాటుచేసిన అమ్మవారిని దర్శించుకున్న తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల గౌరవాధ్యక్షుడు గుండం మోహన్ రెడ్డి

**హైదరాబాద్, అక్టోబర్ 13 (ప్రభాత సూర్యుడు):** శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని బిహెచ్ఇఎల్, రామచంద్రారెడ్డి నగర్ కాలనీలోని శ్రీ స్నేహ లేక్ వ్యూ రెసిడెన్షియల్లో ఏర్పాటుచేసిన నవదుర్గమాత మండపంలో ఆదివారం అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించి శోభాయాత్ర ప్రారంభించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహణ కమిటీ సభ్యులు శ్రీకాంత్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, కృష్ణారావు, మధుసూదన్ రెడ్డి, రాజేష్ సింగ్, గణేష్, మురళీధర్ రెడ్డి, బల్వంత్ రెడ్డి, లక్ష్మీనారాయణ గుప్తా, బి ఎం గుప్తా, రామకృష్ణారెడ్డి, కృష్ణ గౌడ్, బాల మనోహర్ లు మాట్లాడుతూ తమ రెసిడెన్షియల్ లో ఏర్పాటుచేసిన నవదుర్గ మాతకు ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించి శోభాయాత్రను ప్రారంభించినట్లు తెలిపారు. తొమ్మిది రోజులు నిత్య పూజలు, వేద పండితులైన పాలకుర్తి గురునాథ్ శర్మ గారి సారధ్యంలో భక్తశ్రద్ధలతో పూజలు నిర్వహించినట్లు తెలిపారు. రామచంద్రాపురం పట్టణ పురవీధులలో అమ్మవారి శోభాయాత్ర మంగళ హారతులతో, మేళా తాళాలతో, కోలాటాలతో భక్తులను ఆకట్టుకునే విధంగా శోభాయాత్ర నిర్వహించినట్లు తెలిపారు. అమ్మవారి కీర్తనలు చూపరులను, భక్తులను ఆకట్టుకున్నాయని అన్నారు. శోభయాత్ర కంటే ముందు అమ్మవారి మండపానికి తెలంగాణ గెజిటెడ్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గుండం మోహన్ రెడ్డి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి శోభాయాత్రను ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. శోభాయాత్ర ప్రారంభించిన సందర్భంగా గుండం మోహన్ రెడ్డి మాట్లాడుతూ అందరికీ దసరా శుభాకాంక్షలు తెలుపుతూ, అంగరంగ వైభవంగా అమ్మవారి శోభాయాత్రలో పాల్గొంటున్న భక్త మహాశయులకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఘనంగా నిర్వహిస్తున్న అమ్మవారి శరన్నవరాత్రుల పూజలను ఎటువంటి ఆటంకాలు లేకుండా నిర్వహించినందుకు పేరుపేరునా కమిటీ సభ్యులను అభినందించారు. వేద పండితుల మంత్రోచ్చారణలతో రామచంద్రపురం రాయసముద్రం చెరువులో నిమజ్జనం చేసినట్లు తెలిపారు. ఇంకా ఈ శోభాయాత్రలో అమ్మవారి విగ్రహ దాత రాజేష్ సింగ్, ఆనంద్ రెడ్డి, నాగేందర్ రెడ్డి, శ్రావణ్, వినోద్, నారాయణరెడ్డి, గోవర్ధన్ రెడ్డి, సాయికుమార్, శివ శంకర్, రామకృష్ణ, శ్రీకాంత్ రెడ్డి, ఉత్తమ్ లు పాల్గొన్నట్టు తెలిపారు.

## 'సాయిబాబా భౌతికకాయాన్ని మెడికల్ కాలేజీకి అప్పగిస్తాం'

### కుటుంబ సభ్యుల ప్రకటన

**హైదరాబాద్, అక్టోబర్ 13 (ప్రభాత సూర్యుడు):** ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్, పౌర హక్కుల ఉద్యమకారుడు జీఎన్ సాయిబాబా (54) శనివారం రాత్రి హైదరాబాద్ నిమ్స్‌లో కన్నుమూశారు. సాయిబాబా మృతదేహాన్ని ఆయన కోరుకున్న విధంగా మెడికల్ కాలేజీకి దానం చేయనున్నట్లు కుటుంబ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మావోయిస్టు సంబంధాలు ఉన్నాయన్న అభియోగాల కేసులో హైకోర్టు నిర్దోషిగా ప్రకటించడంతో మార్చి నెలలో ఆయన విడుదలయ్యారు. సాయిబాబా భౌతికకాయాన్ని ఆయన బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషుల నివాళులర్పించేందుకు సోమవారం హైదరాబాద్‌లోని జవహర్‌నగర్‌లో ఉంచనున్నట్లు తెలిపారు. ఆయన కళ్లను ఇప్పటికే ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సాయిబాబా మృతిపట్ల 'ఎక్స్' వేదికగా ప్రముఖులు సంతాపం తెలిపారు. ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబా మృతి పట్ల తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ సంతాపం తెలిపారు. " మానవ హక్కుల ఉద్యమకారుల సంఘానికి సాయిబాబా మరణం తీరని లోటు. అణగారిన ప్రజలకు జరిగిన అన్యాయాలకు వ్యతిరేకంగా, స్వేచ్ఛకు ముప్పు ఏర్పడినప్పుడు ఆయన అవిశ్రాంతంగా పోరాడారు. అనేక సవాళ్లను ఎదుర్కొంటూ పౌర హక్కులను కాపాడటంలో ఆయన చూపిన ధైర్యం చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఈ క్లిష్ట సమయంలో ఆయన కుటుంబానికి నా సానుభూతి తెలియజేస్తున్నా"అని ఎక్స్‌లో తెలిపారు. మాజీ ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబా మృతి పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం తెలిపారు.

## తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి పథాన నడవాలి - బండారు దత్తాత్రేయ

**హైదరాబాద్, అక్టోబర్ 13 (ప్రభాత సూర్యుడు):** :తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ముఖ్య మంత్రులు కలసి మెలసి అభివృద్ధి కోసం పరస్పరం పని చేయాలని హర్యానా గవర్నర్ దత్తాత్రేయ ఆకాంక్షించారు. రాజకీయాలకు అతీతంగా పరస్పరం సహకరించుకోవాలన్నారు. ఐకమత్యంతో ముందుకెళ్లాలని, దేశంలోనే తెలుగు రాష్ట్రాలను అగ్రభాగాన నిలపాలని కోరారు. 2005లో రాజకీయాలకు సంబంధం లేకుండా, ప్రేమ, ఆప్యాయత, అనురాగాల కోసం అలయ్ బలయ్‌ను ప్రారంభించామన్నారు. ప్రేమ, ఆత్మీయత, ఐక్యతను చాటుకోవాలన్నదే అలయ్ బలయ్ లక్ష్యమని పేర్కొన్నారు. పలువురు గవర్నర్లు రావడంతో దేశమంతా నగరానికి వచ్చినట్టుగా అనిపించిందని చెప్పారు. ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత %-% తోటివారి ఆలోచనలను, భావాలను గౌరవించటం కూడా ఐక్యత కిందకే వస్తుందని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య అన్నారు. అందరినీ ఒకే వేదిక మీద చూడటం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాజకీయ విభేదాలకు లిమిట్ ఉంటుందని, అది కేవలం సిద్ధాంతాల వరకే పరిమితమవ్వాలన్నారు. నేతలు వ్యక్తిగత దూషణలు చేస్తే కార్యకర్తలు కూడా అలాగే ప్రవర్తిస్తారని పేర్కొన్నారు. దీంతో సమాజానికి చెడు జరుగుతుందని, ఐక్యత, సమష్టి కోసం ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. సమైక్యత వారధుల నిర్మాణం ప్రతిఒక్కరి సామాజిక బాధ్యతగా పేర్కొన్నారు వెంకయ్య నాయుడు. పండుగలకు ఆధ్యాత్మిక ప్రాధాన్యతతో పాటు సామాజిక ప్రాధాన్యత కూడా ఉందని పేర్కొన్నారు. సమైక్యత అంటే అందరూ ఒకేమాట మీద నిలబడటమే కాదు, ఇతరుల ఇష్టాలను గౌరవించటం కూడా అని తెలిపారు. సమాజంలో ఐక్యతా స్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. అదిరిపోయే వంటకాలు %-% అలయ్ బలయ్ కార్యక్రమ అతిథులకు స్పెషల్ వంటకాలను ఏర్పాటు చేశారు. ఘుమఘుమలాడే, నోరూరించే తెలంగాణ వంటలను ప్రత్యేకంగా తయారు చేశారు. నోరూరించే తెలంగాణ సంప్రదాయక వంటకాలు చికెన్, మటన్ బిర్యానీ, చేపల పులుసు, చిరు ధాన్యాల ఉత్పత్తులు, జొన్న రొట్టె, సర్వపిండి, ఇతర పిండి వంటకాలు, గారెలు, బూరెలు వండారు. ఇవే కాకుండా బోటి, తలకాయ కూర, చేపల వేపుడు, చికెన్ వేపుడు, నల్ల, పాయ వంటి 60 రకాల స్పెషల్ వంటకాలను అతిథులకు వడ్డించినట్టు కమిటీ వెల్లడించింది.



RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# రానున్న నాలుగు రోజులు భారీ వర్షాలు

## బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనాల ప్రభావంతో

## అన్ని జిల్లాల కలెక్టర్లను అప్రమత్తం చేసిన ప్రభుత్వం

**అమరావతి, అక్టోబర్ 13 (ప్రభాత సూర్యుడు):** ఆగ్నేయ, నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనాలు ఏర్పాడ్డాయని విపత్తు నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా తెలిపారు. ఈ నేపథ్యంలో రానున్న నాలుగు రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఆదివారం అమరావతిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ప్రత్యేక సీఎస్ ఆర్పీ సిసోడియా మాట్లాడుతూ.. కోస్తాలో పిడుగులతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది. ఈ నెల 17వ తేదీ వరకు కోస్తా, రాయలసీమలో భారీ వర్షాలు కురుస్తాయి. కోస్తా తీరం వెంబడి 40 నుండి 55 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయి. అల్లూరి సీతారామరాజు, ఏలూరు, చిత్తూరు, శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో ఒకటి, రెండు చోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి జల్లు కురిసే అవకాశం ఉంది... అని ఆయన వివరించారు. ఈ నేపథ్యంలో విపత్తు నిర్వహణ శాఖ అన్ని వేళలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్‌లతోపాటు హెల్ప్ లైన్‌లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. భారీ వర్షాల నేపథ్యంలో ముందస్తు చర్యలు తీసుకోవాలని ఏలూరు, ప్రకాశం, పశ్చిమగోదావరి, పల్నాడు, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లను ఆదేశించామని చెప్పారు. ఇక మత్స్యకారులు ఎవరు చేపల వేట కోసం సముద్రంలోకి వెళ్లవద్దన్నారు. దీనిపై ఆదివారం ఉదయం రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి కీలక సూచనలు చేశారు.


# వైభవంగా ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

## శ్రీవారిని ఆరు లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు

### టీటీడీ ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు: ఈవో

**తిరుమల, అక్టోబర్ 13 (ప్రభాత సూర్యుడు):** తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. ధ్వజావరోహణం కార్యక్రమంతో సాలకట్ల బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా తిరుమల బ్రహ్మోత్సవాల విశేషాలను టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడించారు. అన్ని శాఖల సమన్వయంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బంగారు తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. అనంతరం ధ్వజావరోహణంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. టీటీడీ ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఈవో శ్యామలరావు చెప్పారు. మొత్తం 6 లక్షలమంది శ్రీవారి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 2.60 లక్షల మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. 15 లక్షల మంది భక్తులు శ్రీవారి వాహనసేవలను తిలకించారు. అత్యంత కీలకమైన గరుడసేవ రోజున 82,043 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. గరుడసేవలో దాదాపు 3.5 లక్షల మంది భక్తులు పాల్గొన్నారు.ఏడు లక్షల లడ్డూలు బఫర్ స్టాక్ ఉంచారు. మొత్తం 30 లక్షల లడ్డూలను టీటీడీ విక్రయించింది. హుండీ కానుకల ద్వారా బ్రహ్మోత్సవాల సమయంలో రూ.26 కోట్లు ఆదాయం వచ్చినట్లు టీటీడీ తెలిపింది. శ్రీవారి భక్తులకు 32,713 గదులు కేటాయించారు. 475 లక్షల గ్యాలన్ల నీటిని వినియోగించారు. ఫల పుష్ప ప్రదర్శన, ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. తిరుమల కొండను మొత్తం విద్యుద్దీప కాంతులతో అలంకరించారు. పలు ప్రాంతాల్లో దేవతామూర్తుల విద్యుత్ కటౌట్లు ఏర్పాటు చేశారు. వాహన సేవలను దూరం నుంచి కూడా వీక్షించేందుకు వీలుగా 32 పెద్ద డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. టీటీడీ 26 లక్షల భోజనాలు, అల్పాహారం అందించింది. గరుడ సేవ రోజు మాత్రమే 8.71 లక్షల మందికి అన్నప్రసాదాలు, అల్పాహారం అందించినట్లు టీటీడీ ఈవో శ్యామలరావు వివరించారు.





# మన పండగలు సంస్కృతి, సాంప్రదాయాలకు నిదర్శనం

### ఘనంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు, కనకదుర్గమ్మ దసరా మహోత్సవాలు

### ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు నాయుడు

**అమరావతి, అక్టోబర్ 13 (ప్రభాత సూర్యుడు):** అటు తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలను... ఇటు ఇంద్రకీలాద్రిపై విజయవాడ కనకదుర్గమ్మ దసరా మహోత్సవాలు అంగరంగ వైభవంగా ఈ ఏడాది నిర్వహించామని, భక్తులకు పూర్తి ఆధ్యాత్మిక వాతావరణంలో దర్శనం కలిగేలా అన్ని ఏర్పాట్లు చేశామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మద్యమం ఎక్స్ వేదికగా వ్యాఖ్యలు చేశారు. మన పండగలు కేవలం ఉత్సవాల నిర్వహణకే కాదని... మన సంస్కృతి, సాంప్రదాయాలకు, వారసత్వానికి నిదర్శనం. భక్తులకు సౌకర్యాలు పెంచడంతోపాటు దేవాలయాల పవిత్రతను, సాంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత మనపై ఉంది... అని పేర్కొన్నారు. తిరుమల తిరుపతిలో సాలకట్ల బ్రహ్మోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసిన తిరుమల తిరుపతి దేవస్థానాన్ని అభినందిస్తున్నామన్నారు. తిరుమలలో ఏడాదికి 450 పండుగలు నిర్వహిస్తామని, వాటన్నింటిలోకి బ్రహ్మోత్సవం విశిష్టమైనది. ఈ ఏడాది ఇప్పటికే శ్రీవారి మూలవిరాట్‌ను ఆరు లక్షల మంది దర్శించుకున్నారు. 15 లక్షల మంది భక్తులు వాహన సేవలో పాల్గొన్నారు. 26 లక్షల మంది భక్తులు ఈసారి బ్రహ్మోత్సవాలకు వచ్చారు. గతేడాది 16 లక్షల మంది మాత్రమే భక్తులు వచ్చారు... అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. దసరా శరన్నవరాత్రుల వేడుకల్లో భాగంగా విజయవాడలో ఇంద్రకీలాద్రిపై కొలువు తీరిన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వారి దేవాలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ముగింపులో భాగంగా దేవాలయ ప్రాంగణంలో పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రామారావు, దేవాదాయ శాఖ ప్రత్యేక అధికారి రామచంద్ర మోహన్ పాల్గొన్నారు. వారి చేతుల మీదుగా ఈ పూర్ణాహుతి కార్యక్రమం ముగిసింది. చివరి రోజు అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకొనేందుకు భక్తులు ఇంద్రకీలాద్రికి పోటెత్తారు. దేవాలయంలోకి వెళ్లే అన్ని క్యూ లైన్లు భక్తులతో నిండిపోయాయి. దుర్గమ్మ మాల ధారణతో వచ్చిన భవానీలు సైతం భారీ సంఖ్యలో ఇంద్రకీలాద్రికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

# మూసీ కాంట్రాక్ట్‌పై తప్పుడు ప్రచారం

### మన్నె క్రిశాంక్‌కు లీగల్ నోటీసులు

### నిరాధార ఆరోపణలు తగదన్న మెయిన్ హార్ట్ సంస్థ

### 24 గంటల్లోగా సారీ చెప్పాలని డిమాండ్

### ఏం చేసుకుంటారో చేసుకోమన్న క్రిశాంక్



**హైదరాబాద్, అక్టోబర్ 13 (ప్రభాత సూర్యుడు):** ప్రభుత్వాన్ని కార్నర్ చేయాలన్న లక్ష్యంతో పిచ్చిపిచ్చి ట్వీట్లు చేసి చివరకు నవ్వులపాలు అవుతుంటారు బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్. గతంలో ఓయూకు సంబంధించి ఫేక్ సర్క్యులర్ పోస్ట్ చేశారని పోలీసులు అరెస్ట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కరెంట్, నీటి సమస్యలు వచ్చాయనే తప్పుడు ప్రచారాన్ని పబ్లిక్‌లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేసినట్టు తేల్చారు. రిమాండ్ ఖైదీగా జైల్లో ఉండి బెయిల్‌పై బయటకొచ్చారు క్రిశాంక్. ఈ క్రమంలోనే మూసీ సుందరీకరణకు సంబంధించి మెయిన్ హార్ట్ సంస్థపై సంచలన ఆరోపణలు చేశారు. అదంతా తప్పుడు ప్రచారమని సదరు సంస్థ తాజాగా లీగల్ నోటీసులు పంపించడంతో ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది.

**మన్నె ఆరోపణలు ఇవే !**

మూసీ మాస్టర్ ప్లాన్ తయారీ కాంట్రాక్టును మెయిన్ హార్ట్ సంస్థకు అప్పగించారని, సదరు కంపెనీపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయని కొద్ది రోజుల క్రితం ట్వీట్లు, మీడియా ముందు వ్యాఖ్యలు చేశారు క్రిశాంక్. పాకిస్తాన్‌లో చేసిన ఓ ప్రాజెక్ట్‌కు సంబంధించి రూ.3వేల కోట్ల కుంభకోణానికి పాల్పడిందని అన్నారు. ఈయన ట్వీట్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా రీట్వీట్ చేశారు. దీంతో మెయిన్ హార్ట్ కంపెనీ అప్పుడే స్పందించింది. బీఆర్ఎస్ ఆరోపణలను ఖండించింది. తాము పాకిస్తాన్‌లో కన్సల్టెంట్‌గా మాత్రమే వ్యవహరించామని స్పష్టం చేసింది.

**సారీ చెప్పాల్సిందే !**

మెయిన్ హార్ట్ సంస్థ రియాక్ట్ అయిన తర్వాత కూడా క్రిశాంక్ ఆరోపణలు చేస్తూనే ఉన్నారు. దీంతో నిరాధార ఆరోపణలు తగదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ లీగల్ నోటీసులు పంపించింది. తమ కంపెనీ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు దురుద్దేశంతోనే క్రిశాంక్ ఆరోపణలు చేశారని ఫైరయ్యింది. ఇలాంటి పనికిమాలిన ఆరోపణలు, పరువు నష్టం కలిగించే ప్రకటనలు మానుకోవాలని హితవు పలికింది. 24 గంటల్లోగా సారీ చెప్పి, తమపై చేసిన ట్వీట్లను తొలగించాలని డిమాండ్ చేసింది. లేకపోతే, న్యాయపరమైన చర్యలకు దిగుతామని హెచ్చరించింది.

**ఏం చేసుకుంటారో చేసుకోండన్న క్రిశాంక్**


మెయిన్ హార్ట్ సంస్థ ఇచ్చిన నోటీసులపై క్రిశాంక్ స్పందించారు. నోటీసులపై కేటీఆర్‌తో చర్చించానని, బీఆర్ఎస్ లీగల్ సెల్ సమాధానం చెప్తుందని అన్నారు. రూ.3 వేల కోట్ల స్కాంలో మెయిన్ హార్ట్‌కు పాకిస్తాన్ నోటీసులు జారీ చేసింది నిజం కాదా? అని ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ట్వీట్లను తొలగించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దీంతో మెయిన్ హార్ట్ సంస్థ ఎలా ముందుకు వెళ్తుందో అనే ఉత్కంఠ నెలకొంది.

### హైదరాబాద్-విజయవాడ హైవేపై

# భారీగా ట్రాఫిక్ జామ్

## కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు

**అమరావతి, అక్టోబర్ 13 (ప్రభాత సూర్యుడు):** హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్‌లో భారీగా వాహనాల రద్దీ నెలకొంది. వందల సంఖ్యలో వాహనాలు హైదరాబాద్ వైపు వస్తుండటంతో రద్దీగా మారింది. దసరా పండుగను సొంతూర్లలో బంధుమిత్రులతో కలిసి జరుపుకున్న పలువురు సంబురాలు ముగియడంతో తిరుగు పయనమయ్యారు. సోమవారం నుంచి ప్రభుత్వ కార్యాలయాలు, మంగళవారం నుంచి విద్యాలయాలు ప్రారంభం కానుండటంతో హైదరాబాద్‌కు చేరుకునేందుకు బయలుదేరారు. దీంతో జాతీయ రహదారి వాహనాలతో కిక్కిరిసిపోయింది. పంతంగిలోని టోల్‌ప్లాజా వద్ద వాహనాలు బారులు తీరాయి. రద్దీకి అనుగుణంగా టోల్‌బూత్‌లను ఏర్పాటు చేశారు. తెలంగాణ ప్రాంతంలో దసరా, బతుకమ్మ పండుగలు ఘనంగా నిర్వహించుకుంటారు. దసరా సెలవులు కావడంతో, చిన్నా పెద్దా అంతా కలిసి కుటుంబ సమేతంగా హైదరాబాద్ నుంచి తమ స్వస్థలాలకు వెళ్లారు. ఈ నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వచ్చే వాహనాలతో కరీంనగర్ –హైదరాబాద్ జాతీయ రహదారి రద్దీగా మారింది. భాగ్యనగరంలో నివాసం ఉన్న తెలంగాణ ప్రాంత వాసులు స్వస్థలాల నుంచి కార్లు, ఇతర వాహనాల్లో హైదరాబాద్‌కు పయనం అవ్వడంతో హుస్నాపూర్ టోల్ గేట్ వద్ద వాహనాలతో రద్దీ పెరిగింది. కరీంనగర్ నుంచి వచ్చే మొదటి టోల్ ప్లాజా వద్ద వాహనాలు భారీగా వరుస కట్టాయి. ఫాస్ట్ ట్యాగ్ ఉన్నప్పటికీ వాహనాలు ఎక్కువగా వస్తుండటం వల్ల, టోల్‌గేట్ దగ్గర జాప్యం జరుగుతోంది. రుసుము తీసుకోకుండా వాహనాలకు అనుమతి : సిద్దిపేట జిల్లా రాజీవ్ రహదారి దుద్దెడ టోల్ ప్లాజా వద్ద రద్దీ నెలకొంది. దసరా సెలవులు ముగియడంతో అందరూ హైదరాబాద్‌కు ప్రయాణం కావడంతో టోల్ ప్లాజా వద్ద భారీగా వాహనాల రద్దీ నెలకొని రెండు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. దసరా సెలవులకు హైదరాబాద్ నుంచి స్వగ్రామాలకు వెళ్లిన ఉద్యోగులు, వ్యాపారస్తులు విద్యార్థులు తిరిగి భాగ్యనగరానికి సొంత, ప్రైవేటు వాహనాల్లో ప్రయాణం కావడంతో రాజీవ్ రహదారి సిద్దిపేట జిల్లా దుద్దెడ టోల్ ప్లాజా వద్ద భారీగా వాహనాల రద్దీ నెలకొంది. దీంతో టోల్‌గేట్ ఎత్తేసి రుసుము తీసుకోకుండా వాహనాలకు అనుమతి ఇచ్చారు. సాధారణ రోజుల కంటే ఈరోజు మరో లైన్‌ను అదనంగా పెంచినప్పటికీ వెహికల్స్ భారీగా రావడంతో రెండు కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి.



# దేవరగట్టు కర్రల సమరం.. చెలరేగిన హింస

### 70 మందికి గాయాలు... ఇద్దరి పరిస్థితి విషమం

**అమరావతి, అక్టోబర్ 13 (ప్రభాత సూర్యుడు):** దేవరగట్టు కర్రల సమరంలో హింస చెలరేగింది. కర్నూలు జిల్లాలో ఏటా దసరా రోజున అర్ధరాత్రి జరిగే బన్ని ఉత్సవంలో 70 మంది గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ జిల్లా హొళగుంద మండలం దేవరగట్టులో ఏటా విజయదశమి రోజు అర్ధరాత్రి జరిగే కర్రల సమరం ఈసారీ నెత్తురోడింది. హింసకు తావులేకుండా ఈ బన్ని ఉత్సవాన్ని జరుపుకునేలా జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలు ఎలాంటి సత్ఫలితాలివ్వలేదు. ఎప్పటిలాగే హింస చెలరేగింది. రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరులో 70 మంది గాయాలపాలయ్యారు. ఏటా నిర్వహించే ఈ బన్నీ ఉత్సవం ఆనవాయితీగా వస్తోంది. ఆలూరు సమీపంలోని దేవరగట్టు వద్ద కొండపై వెలిసిన మాళమల్లేశ్వరస్వామి ఆలయం ఉంది. ఎప్పటిలాగే దేవతామూర్తులైన మాళమ్మ, మల్లేశ్వరస్వామికి దసరా పర్వదినాన అర్ధరాత్రి 12 గంటలకు కల్యాణం నిర్వహించారు. అనంతరం కొండ పరిసర ప్రాంతాల్లో పాదాలగట్టు, రక్షపడ, శమీవృక్షం, ఎదురుబసవన్న గుడి మీదుగా దివిటీల వెలుతురులో విగ్రహాలను ఊరేగించారు. ఈ ఉత్సవ విగ్రహాలను దక్కించుకోవడం కోసం 5 గ్రామాల ప్రజలు ఓ వర్గంగా, మరో 3 గ్రామాల ప్రజలు ఇంకో వర్గంగా ఏర్పడి కర్రలతో సమరానికి దిగుతారు. మాళమ్మ, మల్లేశ్వర స్వామివార్లు రాక్షస సంహారం చేసిన తర్వాత బన్ని ఉత్సవం నిర్వహిస్తారు. తమ ఇలవేల్పు దైవాన్ని స్వాధీనం చేసుకోవటం కోసం నెరణికి, నెరణికితండా, కొత్తపేట గ్రామాల ప్రజలు ఓ జట్టుగా ఆలూరు, సుళువాయి, ఎల్లార్తి, అరికెర, నిద్రవట్టి, బిలేహాల్ గ్రామాల ప్రజలు మరో జట్టుగా ఏర్పడి కర్రలతో తలపడ్డారు. ఇందులో ఇరువర్గాలవారు తీవ్రంగా గాయపడ్డారు. కర్రల సమరాన్ని చూడటానికి రాష్ట్రం నుంచే కాక కర్ణాటక నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. బన్ని ఉత్సవంలో హింసను నివారించేందుకు 800 మంది పోలీసులు మోహరించినా ఫలితం లేకుండా పోయింది. దేవగట్ట పరిసరాల్లో సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో నిఘాను పటిష్ఠం చేసినా రక్తం చిందింది. గాయపడ్డవారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.



Printed, Published and Owned by CHERUKU UPENDER, Printed at Akshaya Printers, H.No:7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin: 501505, Rangareddy District/Hyderabad City, Telangana. Editor: CHERUKU UPENDAR, Publication at HAMSA PUBLICATIONS, H.No: 7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin:501505, Rangareddy District/Hyderabad City, Telangana. E-mail:upendrabbk@gmail.com RNI: TELTEL12215